





అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు



నాగోబా ఆలయంలో సీఎం పూజలు



ముఖ్యమంత్రిని సన్మానిస్తున్న మేస్రంవంశీయులు



- చిక్‌మాన్, కుప్టి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతాం
- కడెం ప్రాజెక్టు మరమ్మతుల బాధ్యత మాదే..
- 15 రోజుల్లో 15వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ
- త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్
- ఇంద్రవెల్లి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

జిల్లాను దత్తత తీసుకుంటా



ఆదిలాబాద్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి)/ఇంద్రవెల్లి/సిరికొండ: ఇంద్రవెల్లి అమరవీరుల సాక్షిగా ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆనాడు ఇచ్చిన మాట ప్రకారమే ఇంద్రవెల్లి గడ్డ నుంచే అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. శుక్రవారం జిల్లాలో పర్యటించిన సీఎం మొదట కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులర్పించి స్మృతి వనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆదివాసీ బిడ్డలు కొమురంభీం, రాంజీగోండు బ్రిటిష్ రజాకారులకు వ్యతిరేకంగా పౌరుషంతో పోరాటం చేశారని, దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలను ఆర్థికంగా అభివృద్ధి వైపు నడిపిస్తామని, 1981లో కాంగ్రెస్ పార్టీ వారే ఆదివాసీల బిడ్డలను పొట్టనపెట్టుకున్నారని, ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్ నేతలు ఇంద్రవెల్లిని దర్శించుకుంటారని కొంతమంది సన్నాసులు ప్రశ్నించారని అన్నారు. సమైక్యాంధ్రలో అప్పటి పాలకులు ఆదివాసీ బిడ్డలను తుపాకీ తూటాలతో కాల్చిచంపుతుంటే వారి రక్తం చిందిస్తుంటే నిస్సహాయులమై చేతులు కట్టుకుని కూర్చుంటే ఆనాడు తప్పు జరి గింది, జరిగిన తప్పు కు మన్నించండి ఇందిరమ్మ రాజ్యంలో ఆదివాసీ బిడ్డలను ఆదుకుంటామని, గుండెల్లో పెట్టి చూసుకుంటామని ఆనాడే మాటిచ్చామన్నారు అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ వేదిక నుంచి కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నిస్తున్నా 'పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో ఏనాడైనా అడవి బిడ్డల కోసం ఇంద్రవెల్లి అమరవీరుల గురించి ఆలోచించారా? నీ బిడ్డ, నీ చుట్టాల కోసమే తెలంగాణ రాష్ట్రం వచ్చిందా అని ప్రశ్నించారు. 7లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. ఆనాడు కట్టిన కడెం ప్రాజెక్టు మరమ్మతులను చేపట్టారా? సదర్మాట్ ప్రాజెక్టుకు ఏమైనా నిధులిచ్చారు?, ఏజెన్సీలో అడవి బిడ్డలు నివసించే గూడాలకు రోడ్లు నిర్మించారా, మిషన్ భగీరథపేరుపై రూ.40 వేల కోట్లను దోచుకుని తాగు నీరైనా అందించారా?, మీరు నీళ్లిస్తే రూ.60 కోట్లను మేం ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది. ట్రైకర్ ద్వారా తరగతి గదుల నిర్మాణం కోసం రూ.10కోట్లను మంజూరు చేశాం. ఆదివాసీ బిడ్డలు చదువుకోవాలి ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలి. గత ప్రభుత్వం ఏ రోజైనా ఆదివాసీ బిడ్డల కోసం మీ మంత్రివర్గంలో సమీక్షించారా' అని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు వచ్చిన 15 రోజుల్లోనే 15 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేస్తామని, ఎవరి చేతుల్లో తెలంగాణ భద్రంగా ఉంటుందో ప్రజలే ఆలోచించాలని చెప్పారు.

• త్వరలోనే రూ.500లకు గ్యాస్ సిలిండర్

ప్రభుత్వం ఏర్పడి 60 రోజులు కూడా గడవలేదని, కానీ కొందరు పిల్లిశాపనార్థాలు పెడుతున్నారని సీఎం విమర్శించారు. ఆడబిడ్డలను ఆదుకోవాలని కట్టెల పొయ్యి కష్టాలను దూరం చేయాలని, తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని, త్వరలోనే ప్రియాంక గాంధీని పిలిపించి లక్షమంది మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్లను అందిస్తామని చెప్పారు. అలాగే తెల్లరేషన్‌కార్డు ఉన్న వారందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను మీ ఇంటికి ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. కేసీఆర్‌ను తమ కూటమిలోకి రానిచ్చేదే లేదన్నారు. ఆ ఇంటి మీది పిట్ట మా ఇంటి మీద వాలితే కాల్చి పడేస్తామన్నారు. ఎంపీలను ఢిల్లీకి తాకట్టు పెట్టి మోదీ దగ్గర గులాం గిరి చేసేందుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు మహేష్‌కుమార్ గౌడ్, జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వినోద్, వెడ్మబొజ్జుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు మధుయాష్కీ. గౌడ్, వీ. హనుమంత్‌రావు, మల్లు రవి, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధరణిని రద్దు చేసి భూములను తిరిగి ఇస్తాం : డిప్యూటీ సీఎం



ధరణి మూలంగా భూములు కోల్పోయిన ఆదివాసీ గిరిజనులకు తిరిగి ఆ భూములను అప్పగిస్తాం. పోరాటయో ధులు అమరుల ఆశయాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్ర చరిత్రలోనే ఈ రోజు సువర్ణ అక్షరాల తోలిఖించబడింది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దోపిడీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంతం నుంచే అభివృద్ధిని ప్రారంభించాం. ఈ ప్రాంత ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిన అమరుల సాక్షిగా మాట ఇస్తున్నాం. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది. గద్దర్ పేరుపై నంది అవార్డులను అందిస్తాం. ఐటీడీఏను పునరుద్ధరించి స్వయం సహాయక బృందాలకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తాం. చిక్‌మన్ ప్రాజెక్టు నిర్మాణం, త్రివేణి సంగమం అభివృద్ధిని చేస్తాం. సమస్యలన్నింటిని పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ఆదిలాబాద్ నుంచే అభివృద్ధిని ప్రారంభిస్తాం: మంత్రి సీతక్క



ఆదిలాబాద్‌ను అగ్రభాగాన నిలిపిఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధిని చేపడుతాం. ఇంకా అనేక సమస్యలున్నాయి. దేశానికే అన్నం పెట్టిన ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. అలాగే అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దీవించాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో దోపిడీ చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది.

317 జీవోను ఎత్తివేయాలి

• వెడ్మబొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

గత ప్రభుత్వ హయాంలో 317 జీవో పేరిటా ప్రభుత్వ ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీచేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోను ఎత్తివేయాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కడెంప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.5కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాకు ప్రత్యేక నిధులివ్వాలి

• ప్రేంసాగర్ రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల

వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించాలి. గత ప్రభుత్వ హయాంలో చాలా అన్యాయం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాపై దయచూపి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలి. జిల్లాకేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి. పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలి. టైగర్ జోన్ పేరిట ఆదివాసీలను వెళ్లగొట్టే గొట్టే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కోరారు.



ఇంద్రవెల్లి జనసంద్రం

- కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు
- సీఎంగా తొలిసారి జిల్లాకు రేవంత్‌రెడ్డి
- నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు
- అమరుల స్మృతివనం నిర్మాణానికి భూమి పూజ
- పార్లమెంట్ ఎన్నికలకు పూరించిన శంఖారావం
- సీఎం పర్యటనతో కేడర్‌లో జోష్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభకు కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కడంతో ఇంద్రవెల్లి పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారింది. సభకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లానుంచి భారీగా జనం తరలివచ్చారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండసురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి కోమట్‌రెడ్డిలు నాగోబా ఆల యానికి చేరుకున్నారు. తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాదర్బార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళాసంఘాలతో ప్రత్యేకంగా సమావేశమై మేస్రంవంశీయుల ఆశీస్సులు తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. బహిరంగ సభకు సుమారుగా 40వేల మంది హాజరైనట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇంద్రవెల్లి సభా వేదికపై నుంచే గంట కొట్టి పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఎండతాపానికి జనాలు తీవ్రఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 4 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోసం ఎండలోనే కూర్చుండి ఓపికగా ఎదురుచూశారు. సీఎం సభా వేదికపైకి చేరుకోవడం కొంత ఆలస్యంకావడంతో ఉపముఖ్యమంత్రి భట్టివిక్ర మార్క, మంత్రి సీతక్క ప్రసంగాలతోనే సరిపెట్టారు. మిగితా మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, వెంకట్‌రెడ్డి కోమటిరెడ్డి, కొం డసురేఖా, తుమ్మలనాగేశ్వర్‌రావులు సమయం లేక మాట్లాడేందుకు అవకాశం దక్కలేదు.

• కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. బహిరంగ సభ సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేసిన ఉదయం 11, 12 గంటల నుంచే జనం ఇంద్రవెల్లికి చేరుకోవడం మొదలయ్యింది. గంటల తరబడి ఎండలోనే కూర్చుండి రేవంత్‌రెడ్డి ప్రసంగం కోసం ఆసక్తిగా ఎదురు చూశారు. రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కలు మాట్లాడుతున్న సమయంలో సభా ప్రాంగణం కార్యకర్తల నినాదాలు, కేరింతలతో దద్దరిల్లింది. దశాబ్దా కాలం తర్వాత అధికారంలోకి రావడంతో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. ఇంద్రవెల్లి సభా ప్రాంగణం నుంచి దాదాపుగా 2కి.మీల దూరంలో ఉన్న హేమాయికుంట వరకు జనంతో రోడ్లన్నీ కిక్కిరిసాయి. ముందు జాగ్రత్తగా పోలీసులు హేమాయికుంటలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తల వాహనాలను నిలిపివేశారు. హేమాయికుంట నుంచి బహిరంగ సభకు కాలినడకనే కార్యకర్తలు తరలివచ్చారు.



సీఎంకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



సభకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలు



అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న సీఎం



భూమిపూజ చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు



ఆటపాటలతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్న కళాకారులు



వివిధ ప్రాంతాల నుంచి సభకు వస్తున్న ప్రజలు

నిర్మల్‌లో కురిసిన చిరుజల్లులు



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చిరు జల్లులు కురిశాయి. వాతావరణం పగటిపూట చలివీడి వెచ్చదనం కలిగే వేళ చిరుజల్లులు కురిసి చల్లబడింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కురిసిన జల్లులు ప్రజలకు మనోల్లాసం కలిగించింది.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలి



భైంసా వర్క్‌షాప్‌లో పాల్గొన్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, ఫిబ్రవరి 2 : ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ చేపట్టిన సంక్షేమం, ప్రగతి పథకాలపై పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసాలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గావ్ చలో అభియాన్ వర్క్‌షాప్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ ప్రతినిధులు గావ్ చలో అభియాన్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకమవ్వాలన్నారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారికత, అంతర్గత, బాహ్య భద్రత, ప్రగతి, విదేశాల్ల భారతావనికి పెరుగుతున్న గౌరవం తదితర కార్యక్రమాల్లో ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. పదేళ్ల పాటు ఎవరి ఊహకు అందని విధంగా పారదర్శక పాలన అందించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టి మరోసారి కమల వికాసానికి ప్రతి కార్యకర్త ప్రతినబూనాలని సూచించారు. ఇందులో గావ్ చలో అభియాన్ జిల్లా కో కన్వీనర్ తాలోడ్ శ్రీనివాస్, బీజేపీ భైంసా పట్టణ అద్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్‌తో పాటు పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లు మత్తులో..

స్నేహితుల మధ్య రూ.5 కోసం గొడవ

● రోడ్డుపై పడి యువకుడి మృతి ● నిర్మల్ జిల్లాలో ఘటన



మృతుడు కొట్టె యోగేష్ (ఫైల్)

కుభీర్, ఫిబ్రవరి 2 : తెల్లకల్లు మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య రూ. 5కోసం జరిగిన తోపులాటలో.. సీసీ రోడ్డుపై పడి యువకుడు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన పురంశెట్టి యోగేష్ (19), లాలాజీ రమేష్‌లు ఇద్దరు చిన్ననాటి స్నేహితులు. వీరిద్దరూ కలిసి భవన నిర్మాణ పనిలో కూలీలుగా పని చేసేవారు. శుక్రవారం కూలీ పనికి వెళ్లేముందు గ్రామంలోని ఓ తెల్లకల్లు బట్టీలో ఉదయం 9గంటలకు కల్లు తాగారు. ఈ సమయంలో అవసరమైన రూ. 5 కోసం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. గొడవ పెద్దది కావడంతో ఒకరినొకరు కొట్టుకున్నారు. కల్లు మత్తులో యోగేష్‌ను రమేష్ బలంగా తోయడంతో.. అతను పక్కనే గల సీసీ రోడ్డుపై పడి తలకు బలం గా దెబ్బతగిలింది. గమనించిన స్థానికులు యోగేష్‌ను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఇంకా వివాహం జరగలేదు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎండి షరీఫ్ తెలిపారు.

విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడపాలి

● ఆర్టీసీ అధికారులకు ఏబీవీపీ నాయకుల వినతి



డిపో మేనేజర్ అమృతకు వినతిపత్రం అందచేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

భైంసా, ఫిబ్రవరి 2 : రాకపోకల విషయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు భైంసా డివిజన్ పరిధిలోని వివిధ రూట్లలో అదనపు బస్సులు నడుపాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంబంధిత విషయంలో శుక్రవారం భైంసా డిపో మేనేజర్ అమృతకు ఏబీవీపీ నగర కార్యదర్శి చంద్రకాంత్ ఆధ్వర్యంలో పరిషత్ శ్రేణులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశి, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, నగర కార్యదర్శి చంద్రకాంత్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో రద్దీ అధికమయ్యిందన్నారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఎక్కడ కూడా బస్సుల రాకపోకలకు సమయ సారణికి అనుగుణంగా జరుగడం లేదన్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు అవస్థల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం పూట విద్యా సంస్థలకు అలస్యంగా రావడం, రాత్రి వేళ వరకు ఇంటికి చేరుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.పరీక్షలు సమీపించిన నేపథ్యంలో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళలో అధనపు బస్సులు నడుపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు.

గ్రామాల్లో ప్రారంభమైన ప్రత్యేక అధికారుల పాలన

● 19 పంచాయతీలకు ఏడుగురు ప్రత్యేక అధికారులు





ఎడ్‌బిడ్ జీపీలో ప్రత్యేక అధికారిగా అమీర్‌ఖాన్
ముథోల్ జీపీలో ప్రత్యేక అధికారికి సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

ముథోల్, ఫిబ్రవరి 2 : ప్రత్యేక అధికారుల పాలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గెజిటెడ్ అధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని ముథోల్ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా జాదవ్ చందు, ఆష్ట, బ్రహ్మన్‌గాం, గన్నోర గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా అజ్మీరా భాస్కర్, విట్టోలి, విట్టోలి తండా, రువ్వి జీపీలకు మైసాజి, చించాల, ఎడ్‌బిడ్, తరోడా జీపీలకు అమీర్ ఖాన్, ఎడ్‌బిడ్ తండా, చింతకుంట, తరోడా జీపీలకు రామారావు, వడ్తాల్, కారేగాం, బోరేగాంలకు ఎండీ అతికొద్దిన్, మచ్కల్, ముద్గల్, రాంటెక్‌కు సురేష్ బాబులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేక అధికారులకు సర్పంచ్‌లు, నాయకులు సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం : ఎస్‌ఎఫ్‌ఐ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేనట్లయితే రాబోయే రోజుల్లో పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్ శుక్రవారం అన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ఆధ్యాత్మికతతో ఆరోగ్యం

● మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్

బోథ్, ఫిబ్రవరి2: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. మండలంలోని చింతలపూడి గ్రామంలో శుక్రవారం ఆయన అఖండ హరినామ సప్తహ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. భక్తి భావంతో మానసిక ప్రశాంతత కలగడంతోపాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని అన్నారు. నారాయణ మహారాజ్ ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

సీఎం సభలో మంచిర్యాల ఎమ్మెల్యే ఫ్లెక్సీ చింపివేత

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫొటో లేకపోవడంతో.. అనుచరుల ఆగ్రహం

ఆదిలాబాద్, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించిన తెలంగాణ పునర్నిర్మాణ సభలో ఫ్లెక్సీ పంచాయితీ తెరపైకి వచ్చింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి ప్రాంతంపై తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని సీఎం వెల్లడిస్తున్న తరుణంలో సభ వద్ద ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫ్లెక్సీ కాకుండా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం.. అందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఫొటో లేకపోవడంతో బొజ్జు అనుచరులు ఆగ్రహించారు. వెంటనే ఆ ఫ్లెక్సీని చించేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఫ్లెక్సీ కాకుండా మంచిర్యాల ఎమ్మెల్యే ఫ్లెక్సీ పెట్టడం కచ్చితంగా కవ్వింపు చర్యలకు పాల్పడమేనని బొజ్జు అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభకు అంత రాయడం కలగకుండా ఓపిక పట్టి సభ ముగిసిన వెంటనే ఆ బ్యానర్‌ను నాయకులు చించివేశారు.


ఫ్లెక్సీని చించేస్తున్న కాంగ్రెస్ నాయకుడు

సంక్షిప్త సమాచారం

మంత్రి పొన్నంను కలిసిన బీసీ సంఘం సభ్యులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి2: బీసీ సంక్షేమ సంఘం జిల్లా సభ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దండెవిఠల్, బీసీ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈనెల 11న బీసీ సంఘం నూతన భవన ప్రారంభోత్సవానికి రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఇందులో సంఘం అధ్యక్షుడు దత్తు, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

4న కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి2: ఈనెల 4న ఆదిలాబాద్ టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించనున్న కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16న దేశ వ్యాప్త సమ్మె విజయవంతం కోసం జిల్లా సదస్సను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నేతలు వెంకట్ నారాయణ, అశోక్, రాజు, చిలుకా, దేవిదాస్, గణేష్ ఉన్నారు.

ఇంద్రవెల్లికి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు


జెండా ఊపి వాహనాలను ఇంద్రవెల్లికి పంపుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి


సభకు ఉట్నూర్ నుంచి బయల్దేరిన మహిళా కార్యకర్తలు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి2: ఇంద్రవెల్లి పోరుగడ్డపై తెలంగాణ పునర్నిర్మాణ సభ పేరుతో నిర్వహించిన చలో ఇంద్రవెల్లి సభకు తలపెట్టిన ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో సుమారు 20వేల మంది ప్రత్యేక వాహనాల్లో శుక్రవారం ఇంద్రవెల్లి బయలుదరారు. జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానం వద్ద సభ ఇన్‌చార్జీ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి కంది శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి వాహనాలను ఇంద్రవెల్లి సభకు పంపారు. ఇందులో డీసీసీబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, జైనథ్‌జడ్పీటీసీ తుమ్మల వెంకటరెడ్డి, కిషన్, శ్రవణ్‌నాయక్, సుజాత్‌అలీ, రాజ్ మహమ్మద్, గంగారెడ్డి, గ్రామాల నాయకుల్యున్నారు.

ఉట్నూర్: సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ప్రజలను భారీగా తరలివెళ్లారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో ఉట్నూర్, కడెం, ఖానాపూర్, పెంబి, దస్తూరాబాద్ మండలాల నుంచి జనసమీకరణ నిర్వహించారు. ప్రతీ నియోజకవర్గం నుంచి సుమారు 10వేల మందికి పైగా ప్రజలను తరలించాలని అధిష్టానం ఆదేశించడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కార్యకర్తలను నాయకులను సమీకరించి ముందస్తు కోసం సమావేశం నిర్వహించడంతో నాయకులు, కార్యకర్తలు తరలించారు. ఉట్నూర్ పట్టణంలోని శాంతినగర్ ప్రాంతం నుంచి జిల్లా నాయకులు లాజర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు తరలివెళ్లారు. కార్యక్రమంలో అంజుష్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధికి సహకరించాలని
సీఎంకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే వినతి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి2: ఆదిలాబాద్‌లోని ఆర్‌వోబీ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ కాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, నియోజకవర్గంలో వివిధ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పాయలశంకర్ వినతిపత్రం అందించారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. భూసేకరణకు చొరవ చూపి నిధులు విడుదల చేయాలని సీఎంను కోరారు. అలాగే ఆదిలాబాద్‌లో ఉడాన్‌పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సుముఖంగా ఉందని, గత ప్రభుత్వానికి కేంద్రం ఎన్నిసార్లు ప్రపోజల్స్ పంపినా స్పందించలేదని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ముందడుగు వేయాలని కోరారు. అలాగే వందల ఎకరాలకు నీరందించాల్సిన కోర్టాచనకా బ్యారేజీ నిధుల కొరతతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, పేదల భూములు ముంపునకు గురవుతున్నాయని, వారికి న్యాయం చేసి భూసేకరణకు నిధులివ్వాలని కోరారు. స్థానికంగా మరిన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు.

మంత్రి సీతక్కను కలిసిన తుడుందెబ్బ నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి2: రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపురావ్ కలిశారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ విశ్రాంతి గృహంలో మంత్రి సీతక్కని కలిసి ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ తరపున శాలువాతో సన్మానించి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు ఉయిక సుదర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడంభారత్, జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, ఉట్నూర్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సీతక్కతో తుడుందెబ్బ నాయకులు

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

● మాజీ మంత్రి జోగురామన్న


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి2: డిసెంబరు 9 నుంచి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామన్న కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ మాట మారుస్తూ పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు వస్తాయని ప్రజలను మభ్యపెట్టడం సమంజసం కాదని మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. పట్టణంలోని మహాలక్ష్మివాడలో గల భవాని గార్డెన్‌లో నిర్వహించిన వార్డుకమిటీ సమావేశంలో మాజీమంత్రి పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలతో ఓట్లు వేయించుకొని, మళ్లీ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపిస్తేనే ఈ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంఇచ్చిన ఆరు గ్యారెం టీలను ప్రజలకు అందే వరకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీతోఅండగా ఉంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ స్థానాలను గెలుపే దిశగా కమిటీలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, మైనార్టీ నాయకులు సలీం, బీసీ సెల్ అధ్య క్షుడు దాసరి రమేష్, మహిళా నాయకురాలు బొడగం మమత, కౌన్సిలర్లు సంద నర్సింగ్, తదితరులు ఉన్నారు.

జయంతి వేడుకలను విజయవంతం చేయాలి

రమాబాయి అంబేద్కర్ 126వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడు కలను కైలస్‌నగర్ అశోక్ బుద్ధ విహార్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ మహిళా మండలి సభ్యులతో కలిసి కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు శోభతుల్జాపూరే, బేబిబయికానిండే, అరుణ, సులోచన, కౌన్సిలర్లు వెంకన్న, ధర్మపా ల్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ట్రిపుల్ ఐటీ సతమతం

● ప్రత్యామ్నయం వైపు అధ్యాపకుల చూపు ● తగ్గిపోతున్న అధ్యాపకుల సంఖ్య ● మరో పక్క పదేళ్లుగా భర్తీ కాని ఖాళీ పోస్టులు ● విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం



ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం


తరగతి గదుల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

బాసర, ఫిబ్రవరి, 2: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకే కాదు అధ్యాపకుల సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత కొన్నేళ్ల నుంచి విన్నవిస్తూ ఉద్యమించిన ఉద్యోగుల సమస్యలకు మోక్షం లేదు. దీంతో నమ్మకం లేక ఒక్కొక్కరు జారుకుంటున్నారు. ప్రత్యామ్నయం వైపు చూస్తూ అవకాశాలు రాగానే రాజీనామాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతియేటా కొంతమంది ఉద్యోగులు తగ్గిపోతూ వస్తున్నారు. తాజాగా ముగ్గురు, నలుగురు అధ్యాపకులు ఇతర అవకాశాలు రావడంతో వెళ్లిపోయారు. ఇక్కడ ఉద్యోగ భద్రతతో పాటు వారికి రావాల్సిన బెనిఫిట్స్ రాకపోవడంతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి మరిన్ని ఉద్యోగ నియమక నోటిఫికేషన్‌లు వస్తే ఇంకా చాలా మంది వెళ్లిపోతారని చర్చ సాగుతుంది. ఎంతో పేరుగాంచిన ట్రిపుల్ ఐటీలో ఒకవైపు ఉన్న ఉద్యోగులు ఒక్కొక్కరు ఇలా ఖాళీ అవుతుంటే మరోపక్క పదేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. అరకొర సిబ్బందితో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుంది. అధికారులు ఈ విషయాన్ని పెద్ద సీరియస్‌గా తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. వారి సమస్యలను ఒక్కొక్కటి దశలవారీగా పరిష్కరిస్తూ వారిలో భరోసా కల్పించే అవసరం ఎంతైనా ఉంది.

పర్మినెంట్ కోసం 16 ఏళ్లుగా నిరీక్షణ

సమైక్య రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో 2008లో బాసరతో పాటు ఇడుపులపాయ, నూజివీడులో ట్రిపుల్ ఐటీలను నెలకొల్పారు. రాష్ట్ర విభజన అనంతరం మన రాష్ట్ర విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీ ఒకటే మిగిలింది. ట్రిపుల్ ఐటీ ప్రారంభంలో 129 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు, 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్‌లను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికి వీరే పని చేస్తున్నారు. మరో 70 మంది అధ్యాపకులను గెస్ట్ ఫ్యాకల్టీగా తాత్కాలికంగా నియమించుకున్నారు. మరో 125 మంది ప్రొఫెసర్‌లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఈ పోస్టుల భర్తీకి 2014 నుండి పలుమార్లు ప్రయత్నించినప్పటికి నియమకాలు మాత్రం జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్‌గా క్రమబద్ధీకరించింది. కాని యూనివర్సిటీ ఏర్పడిన నాటి నుండి నిరీక్షిస్తున్న బాసర ట్రిపుల్ ఐటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోకపోవ డంతో వారిలో అసంతృప్తి నెలకొంది. అన్ని అర్హతలు ఉండి ప్రతిభ ఉన్నప్పటికి ఉద్యోగభద్రత లేకపోవడం వారిని నిరాశకు గురిచేసింది. దీంతో ప్రత్యామ్నయ అవకాశాలు వస్తే ట్రిపుల్ ఐటీ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. ప్రతి సంవత్సరం ఐదు నుంచి 15 మంది అధ్యాపకులు ఇక్కడి నుంచి వెళ్లిపోయి ఇతర ఉద్యోగాల్లో చేరుతున్నారు. 19 మంది పర్మినెంట్ ప్రొఫెసర్‌లు ఉంటే అందులో ఉన్నత చదువుల పేరిట దాదాపు 12 మంది సెలవుల్లో వెళ్లారు. తప్పని పరిస్థితుల్లో అధికారులు తాత్కాలికంగా అధ్యాపకులను నియమించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. తాత్కాలికం కావున అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ప్రతిభ గల బోధకులు ముందుకు రావడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. 2014 వ సంవత్సరం నుండి యూనివర్సిటీలో 125 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఒక్కరికి .. రెండు లేదా మూడు బాధ్యతలు

అసలే అరకొరగా ఉన్న అధ్యాపకులకు అదనపు బాధ్యతలు తలనొప్పిగా మారింది. ఒకవైపు విద్యాబోధన, మరోవైపు అదనపు బాధ్యతలతో తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. ఎక్కడ లోపం జరిగినా అధికారుల క్రమశిక్షణ చర్యలకు లోనవుతామనే భయంతో వారు పనిచేస్తున్నారు. డీన్‌లు, హెడ్ ఆఫ్ ద డిపార్టుమెంట్, ఎగ్జామినర్స్ చీఫ్ వార్డెన్స్, వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్స్ వంటి కీలకమైన బాధ్యతలను అధ్యాపకులకు అప్పజెప్పుతున్నారు. దీంతో సమావేశాలు, సమీక్షలకు హాజరవుతూ విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసే క్రమంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత చేసినా అదనపు లాభాలు, గుర్తింపు ఉందా అంటే లేదనే చెప్పవచ్చు. ఉద్యోగుల కొరత కారణంగా అర్హత లేని వారికి కూడా ఉన్నత స్థాయి బాధ్యతలను అధికారులు మోపడం వల్ల పరిపాలన లోపాలు తలెత్తుతున్నాయి.

ఉద్యోగుల సంక్షేమం పట్టని అధికారులు

యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ రెండు రకాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరి ప్రధాన డిమాండ్ క్రమబద్ధీకరణతో పాటు నిబంధనల ప్రకారం వేతనాల పెంపు, ఇతర భత్యాల కోసం వీరు పోరాటం చేస్తున్నారు. రెండు, మూడు నెలలకు ఒకసారి అధికారులు హామీలివ్వడం తప్పా ఏళ్ల గడుస్తున్నా ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇటీవల ఒక మీటింగ్‌లో విసిగి వేసారిన ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం వైస్ చాన్సలర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. హామీలిస్తున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రిందట పీఆర్సీ పేరిట అన్ని శాఖల్లో అన్నిస్థాయి ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెరిగినప్పటికి తమకు మాత్రం పెరగలేదని యూనివర్సిటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నర్సాపూర్(జి), జనవరి 2 మండల కేంద్రంలో గత సంవత్సరం చేపట్టిన గాల్వానైజ్డ్ ఫెన్సింగ్ పనులను జిల్లా పంచాయతీరాజ్ విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ డీఈ బండి ప్రతాప్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుండి పిర్యాదు రావడంతో అభివృద్ధి పనుల క్వాలిటీని పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బండి ప్రతాప్, ఎఈ గౌరిశ్, పంచాయతీరాజ్ ఎఈ సూర్యతేజగౌడ్, మాజీ సర్పంచ్ అర్గుమీది రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానూర్‌పోలీసుస్టేషన్‌ను
సందర్శించిన భైంసా ఏఎస్పీ

తానూర్, ఫిబ్రవరి 2 : మండల కేంద్రం తానూర్ పోలీసుస్టేషన్‌ను శుక్రవారం భైంసా ఏఎస్పీ సుభాస్‌కాంతిలాల్ పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాన్య ప్రజలకు పోలీసులు అండగా ఉండాలని వారితో స్నేహభావంగా మెసులు కోవాలని సూచించారు. ఈయన వెంట ఎస్సైలు లోకం సందీప్, ఏఎస్సైలు నర్సింగ్‌భాను, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్ మండల ప్రత్యేక అధికారులు వీరే

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. బన్సపల్లి, మాయపూర్, గుండంపల్లి గ్రామ పంచాయతీలకు ఎంపీడీవో మోహన్, దిలావర్‌పూర్, మాడేగాం గ్రామాలకు ఎంపీవో అజీజ్ ఖాన్, సముందర్‌పల్లి ఎంఈవో శంకర్, కాల్వ, కాల్వ తండా గ్రామాలకు ఏవో స్రవంతి, కంజర్ పశువైద్యాధికారి డా. నంద కుమార్, న్యూ లోలం తహసీల్దార్ సరిత, సాంగ్వి ఇరిగేషన్ ఏఈ గంగాధర్, సిర్గాపూర్ పీఆర్ఏఈ శివకృష్ణ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ. రమణారావు శుక్రవారం డిమాండ్ చేశారు.





ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న భైంసా పశువైద్యాధికారి

ప్రారంభమైన ప్రత్యేక పాలన

- జిల్లాలో గెజిటెడ్ అధికారుల కొరత
- 396 గ్రామ పంచాయతీలకు 178 మంది అధికారులు
- ఒక్కో అధికారికి రెండుకు పైగా పంచాయతీల బాధ్యత
- త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలు

భైంసా, ఫిబ్రవరి 2 : పంచాయతీల్లో అయిదు సంవత్సరాలుగా సర్పంచుల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య రీతిలో కొనసాగిన గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి మారింది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 396 గ్రామ పంచాయతీలకు 178 మంది గెజిటెడ్ ప్రత్యేకాధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ అశిష్‌సంగ్వాన్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా శుక్రవారం ఉత్తర్వులు అందుకున్న గెజిటెడ్ అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులుగా బాధ్యతలను చేపట్టారు. పంచాయతీల ఎన్నికలు పూర్తయి కొత్త సర్పంచులు కొలువు తీరే వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

గెజిటెడ్ అధికారుల కొరతతో ఒక్కో అధికారికి రెండుకు పైగా గ్రామ పంచాయతీల బాధ్యతలు

పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా గెజిటెడ్ అధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలో గెజిటెడ్ అధికారుల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు గాను ఒక్కో గెజిటెడ్ అధికారికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పచెప్పాల్సి వచ్చింది. దీంతో జిల్లాలో ఉన్న 178 మంది గెజిటెడ్ అధికారులకు 396 గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పచెప్పారు.

అదనపు బాధ్యతలతో అధికారులపై భారం

జిల్లాలో గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులుగా నియమితులైన అధికారులకు అధనపు బాధ్యతలు అప్పచెప్పడం మూలంగా పని భారం పెరుగనుంది. ప్రస్తుతం ప్రత్యేకాధికారులు నియమితులైన వారందరూ తమ తమ మండలాల పరిధిలో గెజిటెడ్ అధికారి హోదాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి అధికారులొక్కొక్కరికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పచెప్పారు. శాఖ బాధ్యతల పనితోనే ఉక్కిరిబిక్కిరి అవుతూ సతమతమవుతున్న అధికారులు అధనపు బాధ్యతలను నిర్వర్తించడం కత్తిమీద సాము లాంటిదే. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడితే సంబంధిత అధికారులు అందులో కూడా విధులు నిర్వహించాల్సి ఉంది. ఒక్కో అధికారి స్వంత శాఖ బాధ్యతలతో పాటు పంచాయతీల ప్రత్యేకాధికారి బాధ్యత, పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలతో త్రిపాత్రాభినయం చేయాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. తలకు మించిన భారాలతో అధికారులు సతమతమయే సూచనలు కనిపిస్తున్నాయి.

భైంసా మండల ప్రత్యేకాధికారులు వీరే

భైంసా మండల పరిధిలోని 30 గ్రామ పంచాయతీలకు 12 మంది ప్రత్యేకాధికారులుగా నియమింపబడ్డారు. ఇందులో 6 గురు అధికారులకు మూడేసి గ్రామ పంచాయతీలు, మిగిలిన 6 గురు అధికారులకు రెండేసి గ్రామ పంచాయతీల చొప్పున ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పచెప్పారు. పశువైద్యాధికారి డా.విఠల్‌కు చుచుంద్, పాంగ్రి, మాంజ్రి, పంచాయతీరాజ్ ఏఈఈ ఉదయ్ కుమార్‌కు తిమ్మాపూర్, పెండ్‌పెల్లి, హస్గల్, వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్‌కు ఎగ్గామ్, బిజ్జూర్,కథ్‌గావ్, , డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కు మాటేగావ్, హంపోలి, బోర్‌గావ్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌కు లింగా, టాక్లి, కుంటీ, ఎంపీవో మహ్మద్ హుస్సెన్‌కు వానల్‌పాడ్, సుంక్లి, వాటోలి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు చింతల్‌బోరి, కోతల్‌గావ్,ఎంపీడీవో గోపాల కృష్ణారెడ్డికి దేగాం, వాలేగాం, హెచ్‌ఈవో జావేద్ పాషాకు మిర్జాపూర్, సిద్దూర్, ఇర్రిగేషన్ ఏఈఈ కె.శ్రీకాంత్‌కు మహాగావ్, గుండేగావ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్‌కు ఇలేగాం, సిరాల, మండల విద్యాధికారి సుభాష్‌కు కామోల్,కుంసర గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



పెంబి : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో శుక్రవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అధికారులు బాధ్యతలు స్వీకరించారు. పెంబి, నాగపూర్, వేణునగర్ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పుల్గంపాండ్రి, లోతర్య, తాటిగూడ తహసీల్దార్ దూర్వ లక్ష్మణ్, క్రిష్ణనాయక్ తండా, లంబాడి తండా వెటర్నరీ వైద్యులు విజయ్, ఇటిక్యాల్, శెట్‌పల్లి, జంగుగూడ ఇరిగేషన్ పీఆర్ కమలాకర్, మందపల్లి, పస్పుల, హరిచంద్ తండా కోరికంటి ఎంపీవో చిక్యాల రత్నాకర్‌రావు, గుమ్మెన ఎంగ్లాపూర్ ఏఈ విష్ణు, అంకెనా, కర్ణం లొద్ది ఏఈ ఇరిగేషన్ ఉదయ్, వెంకం పోచంపాడ్, పోచంపల్లి టీటీడీవో అంబాజీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కుభీర్ మండలంలో నియామకాలు పూర్తి

కుభీర్, ఫిబ్రవరి 2 : మండలంలోని ఆయా గ్రామాలకు శుక్రవారం ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీవో లింబాద్రి తెలిపారు. పార్డి(కే), కస్రా, సొనారి గ్రామాలకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మండ్లు, డొడర్న, రాంనాయక్‌తాండా, దావూజీ నాయక్ తండాలకు డైఈఈపీఆర్ సురేష్, సాప్లీ, మోల, నిగ్వా గ్రామాలకు సూపరిండెంట్ నవనీత్‌కుమార్, జంగాన్, రంజిని, కుబీర్ గ్రామాలకు ఎం పీడీవో టి.లింబాద్రి, చొండి, జుమ్డా, సాంగ్వీ గ్రామాలకు ఏఈ రమేష్, మాలేగాన్, కుప్టి, అంతర్నిగ్రామాలకు తహసీల్దార్ సోము, పార్డి (బి), వీరేగాన్ గ్రామాలకు ఎంఈవో బి. చంద్రకాంత్, హల్దా, చాత గ్రామాలకు ఏఈ సాయి కమల్, మర్లగొండ, బ్రహ్మేశ్వర్ తండాలకు ఏవో వికార్‌అహ్మద్, శివుని, శివుని తండాలకు ఏఈ సూర్యతేజ, సిర్పెల్లి, ఫకీర్‌నాయక్ తండా, కిషన్‌నాయక్ తండాలకు ఏఈ రాజేశ్, పల్సి, సిర్పెల్లి హెచ్, పల్సి తండాలకు ఏఈ రాజన్న, బెల్గాన్, బెల్గాన తండాల, ధార్‌కుబీర్ గ్రామాలకు వీఏఎస్ డా. విశ్వజిత్,గోడాపూర్, హంపోలీ బి , న్యూసాప్లీ గ్రామాలకు వీఏఎస్ డా. సర్వోత్తం, సౌన, పాంగ్ర, గొడిసెర గ్రామాలక నయాబ్ తహసీల్దార్ డబ్బ్యా పద్మావతిలను నియమించారు.


సీఎస్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న టీఎన్జీవో నాయకులు

సీఎస్ శాంతికుమారిని కలిసిన టీఎన్జీవోలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : చీఫ్ సెక్రటరీ ఏ.శాంతికుమారి శుక్రవారం నిర్మల్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా టీఎన్జీవోల సంఘం నాయకులు ఆమెను అటవీశాఖ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎస్‌కు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తారీఖుకు నాడే జీతాలు జమ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై వివరించారు. ఆమె సానుకూలంగా స్పందించారు. అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, కార్యదర్శి కే. రవికుమార్, నాయకులు జావేద్ హుస్సేన్, బి. శ్రీనివాస్, ఎస్. మోహన్‌రెడ్డి, కే.అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : చలో ఇంద్రవెల్లి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ నిర్మల్‌లో ఆగిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. పీవీ రమణారెడ్డి, జడ్పీటీసీ రఫీ, కొట్టె శేఖర్, జీవన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువ సమస్యను పరిష్కరించండి


మురికి కాలువ పరిశీలిస్తున్న చైర్మన్


నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : నిర్మల్ పట్టణం ఎన్టీఆర్ మార్గ్‌లో మురికి కాలువ సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాలనీలో పర్యటించారు. మురికినీటి కాలువ నీరు రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అత్యవసర సమస్యగా భావించి సమస్యను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ప్రజలు ఇబ్బందులు తొలగించాలన్నారు. కమిషనర్ సీవీఎస్ రాజు, ఏఈ హరిభూషణ్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ దేవిదాస్, తదితరులు చైర్మన్ వెంట ఉన్నారు.


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

మహాలక్ష్మీ జాతరలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

తానూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని కోలూర్ గ్రామంలో శుక్రవారం మహాలక్ష్మీ జాతర ముగింపు కన్నులపండవగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించగా, భక్తులు పెద్దఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యల తరలి వచ్చారు. జాతర నేపథ్యంలో భక్తుల కోసం దుకాణాలు వెలిసాయి. జాతర సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఈకుస్తీ పోటీలకు మహారాష్ట్ర నుంచి సైతం మల్లయోధుల తరలివచ్చారు. కుస్తీపోటీల్లో ప్రతిభ బహుమతి రూ.7777, ద్వితీయ రూ.5555 ఆలయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రకళ శ్రీనివాస్, సురేష్ పటేల్, భూమారెడ్డి, ఎల్లప్ప, సాయినాథ్, చక్రధర్‌పటేల్, బాలాజీ, నాగేష్, విఠల్, ఆలయ కమిటీ సభ్యులు వార్డు మెంబర్లుఉన్నారు.

ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాలు తొలగించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : నిర్మల్ పట్టణ కేంద్రంలో బస్టాండ్ నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా పాదచారుల కోసం మున్సిపాలిటీ ఫుట్ పాత్‌లను నియమించిందని, అక్కడ కొందరు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నారని పట్టణ బీజేపీ అధ్యక్షుడు సాధం అరవింద్ ఆరోపించారు. మున్సిపాలిటీ 7.50 కోట్లతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రయోజనం నెరవేర్చడం లేదన్నారు. వాటిని తొలగించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.

కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భైంసా రూరల్, ఫిబ్రవరి 2 : మండలంలోని హజ్గుల్ గ్రామంలో శుక్రవారం రేకుల షెడ్డు దగ్ధమైంది. స్థానికులు ఫైర్ ఆఫీసర్ సుంగన్నకు తెలిపిన వివరాల ప్రకారం... ఆనంద బాయి అనే మహిళ తన ఇళ్లుకు తాళం వేసి బయటకు వెళ్లగా కొంత సమయంలో ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఇళ్లుతో పాటు రూ. 30 వేలు, తులం బంగారం కాలి బూడిదైనట్లు తెలిపారు. బాధితురాలికి ప్రభుత్వం తరపున సహాయం అందించాలని కోరారు.

సీఎం సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు


సీఎం సభకు తరలివెళుతున్న కుంటాల కాంగ్రెస్ నాయకులు


ఇంద్రవెల్లిసభకు వెళ్తున్న లక్ష్మణచాంద నాయకులు

ఇంద్రవెల్లిలో శుక్రవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ కొన్ని ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసింది. కొందరు వ్యక్తిగత వాహనాల్లోనే వెళ్లారు.

కుంటాల, ఫిబ్రవరి, 2 : మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక వాహనాల్లో వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ జుట్టు అశోక్‌తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరుగనున్న సీఎం సభకు మండలం నుంచి పలువురు నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా ఇంద్రవెల్లిలో జరిగే తెలంగాణ పునర్నిర్మాణ సభకు మండలంలోని లక్ష్మణచాంద, మల్లాపూర్, మునిపెల్లి, చింతల్‌చందా, పార్‌పెల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటల శ్రీనివాస్, అట్ల రవి, ప్రతాప్ రెడ్డి, కమల్‌కోట రాజారెడ్డి, చింతకింది శేఖర్, బొడ్డు మోహన్, నగేష్, భూమన్న, రమేష్, విజయ్, రవి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంబి : సీఎం సభకు మండలం నుంచి పలువురు నాయకులు బయలుదేరారు. తెలంగాణలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా ఇంద్రవెల్లిలో జరిగే తెలంగాణ పునర్నిర్మాణ సభకు మండలంలోని వివిధ గ్రామాల్లో నుండి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, గుగ్గిళ్ల భూమేష్, స్వామి, కాల్వ దేవేందర్, గోరి పెద్దయ్య, వెద్మ శేఖర్, జగన్ రావు, తదితరులు ఉన్నారు.

కుభీర్ : ఆదిలాబాద్‌లోని ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు జావిద్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సభకు సీఎం రేవంత్ హాజరవడంతో నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.


సీఎం సభకు తరలివెళ్తున్న పెంబి కాంగ్రెస్ నాయకులు


.. కుభీర్ మండల కాంగ్రెస్ నాయకులు

రోడ్డు భద్రత నియమావళి పాటించాలి


హెల్మెట్ ధరించిన వాహన చోదకులను సన్మానిస్తున్న టౌన్ సీఐ రాజారెడ్డి

భైంసా, ఫిబ్రవరి 2 : వాహన చోదకుందరూ రోడ్డు భద్రతా నియమావళిని పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి పెర్కొన్నారు. శుక్రవారం భైంసా పట్టణ నిర్మల్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవమ్ భాగంగా వాహన చోదకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మద్యం సేవించకూడదని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్‌లతో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు వాహనాలను నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను వివరించి భద్రతా నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న చోదకులకు సన్మానించి గులాబీ పుష్పాలను అందించారు.

జాతీయస్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



ముథోల్, ఫిబ్రవరి 2 : యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో 15వ జాతీయస్థాయి యోగ పోటీలు పంజాబ్‌లో జరిగాయి. మండలంలోని ఆష్ట గ్రామ భాష్యం స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. అందులో విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన స్పందన, మహేష్, సమరత, విఘ్నేష్, దినేష్, బాలాజీ, అచ్యుతానంద్ విద్యార్థులకు ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, డా. నగేష్‌లు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : నిర్మల్‌లో శనివారం ఆదర్శనగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, సిద్దాపూర్, ఈద్గామ్, భాగ్యనగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంలో భాగంగా విద్యుత్ వైర్లు, స్తంభాలు మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్ల ప్రదానం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : నిర్మల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్యాంపస్ టు కార్పొరేట్‌పై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎండీ అబ్దుల్ మతిన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాఫ్ట్‌స్కిల్స్, ప్రిపరేషన్ రెస్యూమ్ లీడర్షిప్ క్వాలిటీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ప్రిన్సిపాల్ భీమ్‌రావు, డాక్టర్ శంకర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు రెడ్డి సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : ఆర్‌బీవీఆర్‌రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, కే. పోతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రాథమిక సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శ దివ్యాంగ సంఘ కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 2 : ఆదర్శ దివ్యాంగ కార్యవర్గాన్ని శుక్రవారం నిర్మల్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కదం భగవాన్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా సగ్గంముత్యం, ఉపాధ్యక్షుడిగా భోజన్న, మండల అధ్యక్షుడిగా ఎస్.విజయను నియమించారు.